క్లుప్తంగా

విద్యార్థులకు వజ్రోత్సవ పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల: జిల్లా ఏర్పడి 75 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో సీహెచ్ హేమ, జి.జ్ఞానేశ్వరి, ఆర్.దుర్గాప్రసాద్, వక్తృత్వ పోటీలో ఎం.అశ్విని, ఎం.దుర్గాప్రసాద్, బి.హేమసుందరరావు, చిత్రలేఖనం పోటీల్లో కీర్తన, ఎం.భార్గవి, సీహెచ్ లహరిలు విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ పి.శైలజ, అధ్యాపకులు పర్యవేక్షించారు.

రాష్ట్రంలో అరాచక పాలన



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం మంగళవారం పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ నేతలందరిని హౌస్ అరెస్ట్ చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి, పక్క జిల్లాల నుంచి వచ్చిన వారితో టీడీపీ నేతలు దగ్గరుండి ఓట్లేయించారని ఆరోపించారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్టలో నేరుగా పోటీలో ఉన్న అభ్యర్థినే బెదిరించారని, పులివెందులలో దొంగఓట్లు వేస్తూ దొరికిన ఇతర ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు ఉన్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో టీడీపీ అరాచకం రాజ్యమేలుతుందని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. టీడీపీ, పోలీసులు వ్యూహాత్మకంగా కుట్ర చేశారని ఆరోపించారు.

అక్రమ అరెస్టులపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ఎలక్షన్ కమిషన్, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా డీసీసీ ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత అంబటి కృష్ణారావు మాట్లాడుతూ ఢిల్లీ పోలీసులు 300 మంది ఎంపీలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ప్రతిపక్షాల గొంతునొక్కడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మంత్రి నరసింహమూర్తి, ఆబోతుల వెంకటనాయుడు, మామిడి సత్యనారాయణ, బొచ్చ రమణ, ఇజ్జురోతు రమణ, చాన్ బాషా, సైదుల్లాఖాన్, టి.గణపతి పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: రాగోలు వద్ద ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్షన్నర నష్టం వాటిల్లినట్లు బాధితుడు చల్ల వెంకటరమణ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ సింధూర

శ్రీకాకుళం అర్బన్: మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతోనే క్యాన్సర్ ముప్పు వాటిల్లుతోందని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. మంగళవారం మునసబుపేటలోని గాయత్రీ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళల్లో 28 శాతం మంది బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, దీనిని ఆదిలోనే గుర్తించే మేమోగ్రామ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బగాది శ్రావ్య, యోగా గురువు ఎస్.రమ్య, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం నాశనం



ఎచ్చెర్ల : ర్యాగింగ్‌తో జీవితం నాశనమవుతుందని ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తి అన్నారు. కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ వీక్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి.కె.చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీ హ్యాండ్!



- ప్రత్యేకంగా నిలుస్తున్న ఎడమ చేతివాటం
- ఎంతమందిలో ఉన్నా గుర్తింపే
- నేడు లెఫ్ట్‌హ్యాండర్స్ డే

శ్రీకాకుళం కల్చరల్ :

మన సమాజంలో ఎడమ చేతివాటం వారు అరుదుగా కనిపిస్తున్నారు. ప్రతి వంద మందిలో 90 శాతం మంది కుడి చేతివాటం కలిగి ఉంటారని అంచనా. అందుకే ఎడమ చేతివాటం వారు ప్రత్యేకంగా నిలుస్తుంటారు. చిన్నప్పుడు బడిలో పలకపై రాత మొదలు పెద్దయ్యాక చేసే పని వరకు ఎక్కడ ఉన్నా వీరిది ప్రత్యేక శైలి. ఈ ఎడమ చేతివాటం అనేది కొంతమందికి జన్యుపరంగా మొదలైతే.. మరికొందరు అనుకరణ చేయడం.. ఇంకొందరు చిన్నప్పుడు కుడిచేతికి దెబ్బతగిలితే క్రమేపీ ఎడమ చేతివాటానికి అలవాటుపడుతుంటారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, క్రికెట్‌లో ప్రపంచ రికార్డులు సృష్టించిన సౌరవ్‌గంగూలీ, బిగ్‌బీగా పేరుపొందిన అమితాబ్ బచ్చన్, తెలుగు సినిమాల్లో ప్రముఖ నటులు సూర్యకాంతం, సావిత్రీ, ఎన్టీ రామారావు ఇలా పలు రంగాలలో ఎడమ చేతివాటం వారు ఎందరో ఉన్నారు. జిల్లాలోనూ పలువురు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నేడు ప్రపంచం లెఫ్ట్‌హ్యాండర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

హిందూ సంప్రదాయంలో..

- హిందూ సంప్రదాయంలో ఎడమచేతిని మహిళగా, కుడి చేతిని పురుషునిగా భావిస్తుంటారు.
- భార్యాభర్తలు ఎక్కడైనా నిలబడేటప్పుడు భార్య భర్తకు ఎడమ వైపునే ఉండాలి.
- వివాహం సమయంలో ఉంగరాలు మార్చుకునేందుకు ఎడమచేతి మూడో వేలిని ఉపయోగిస్తాం.
- ఎడమ కన్ను అదిరితే విరోధులను చూస్తామట.
- శుభకార్యాల సమయంలో ఎడమ చేతివాటం ఉన్నవారికి కొన్ని ఇబ్బందులూ ఎదురవుతుంటాయి.

మందలించినా..



నా పనులన్నీ ఎడమ చేతితోనే చేస్తాను. పెద్దలు మందలించినా అలవాటు పడిన చేయి కావడంతో వాడక తప్పడం లేదు. తినడం, రాయడం కుడిచేతితోనే చేస్తాను. ఎడమ చేతితోనే ఎక్కువ స్పీడ్‌గా పని చేయగలుగుతాను.

– కిల్లి సతీష్, బ్యాంకు ఉద్యోగి, శ్రీకాకుళం

అలవాటు..



మా అమ్మ వారింట్లో ఐదుగురు అక్కాచెల్లెళ్లు. అందరి ఇళ్లల్లోనూ ఒకరి ఎడమ చేతి వాటం వచ్చింది. మా ఇంట్లో నాది ఎడమ చేతివాటమే. మా పెదనాన్న ఎంత దెబ్బలాడినా అలవాటు మానుకోలేకపోయా. చాలా వేగంగా పనులు చేస్తాను. ఎడమచేయి నాకు చాలా లక్కీ.

– దాసరి విజయలక్ష్మీ, కానిస్టేబుల్, శ్రీకాకుళం

అదృష్టంగా భావిస్తా..



ఎడమ చేతివాటం అదృష్టాన్ని ఇచ్చింది. ఉద్యోగం సాధించి ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతుంటే అందరూ అనుకున్నట్టే నా ఎడమచేతి అదృష్టం అనుకున్నాను. పనులు చేసేటప్పుడు ఎడమచేతినే ఎక్కువగా ఉపయోగిస్తాను. నాకు తెలియకుండానే ఈ అలవాటు వచ్చింది.

పి.ఈశ్వరరావు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్, శ్రీకాకుళం

అన్ని రంగాల్లోనూ..



నేను ఎడమ చేయిని లక్కీహ్యాండ్‌గా భావిస్తా. ఉద్యోగంతో పాటు ఎన్నో విజయాలు వరించాయి. ఏపీ సెట్‌లో గోల్డ్‌మెడల్ సాధించాను. మా అత్తవారింట్లో ఎడమచేతివాటానికి ఎటువంటి అభ్యంతరం పెట్టలేదు. రాయడంతో పాటు పెయింటింగ్ కూడా చేస్తా.

– పి.లక్ష్మీప్రసన్నభారతి, గృహిణి, అరసవల్లి

గ్రంథాలయాలతో ఉజ్వల భవిష్యత్



రంగనాథన్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్న విద్యార్థుల తలరాతలు మారిపోతాయని.. ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవచ్చని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. లైబ్రరీ సైన్స్ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 132వ జయంతి వేడుకలు మంగళవారం కళాశాల లైబ్రరీ సైన్స్ విభాగంలో ఇన్‌చార్జి పీఎల్వీ భారతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.మౌనిక, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కోకాలనీ శాఖా గ్రంథాలయంలో లైబ్రరీ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన, సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రణస్థలం: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం మండలాలకు చెందిన పలువురికి సుమారు రూ.22లక్షల చెక్కులు పంపిణీ చేశారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ తదితరులు

రణస్థలం: రాష్ట్రంలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయ్యిందని వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లను ఆక్రమించి వైఎస్సార్ సీపీ ఏజెంట్లపై కూటమి వర్గీయులు దాడులు చేయడం దారుణమన్నారు. కడప జిల్లాకు చెందిన మంత్రి పోలింగ్ బూత్‌లో ప్రవేశించి పోలీసుల సమక్షంలో రిగ్గింగ్ చేయడం సిగ్గుచేటన్నారు. మేధావులు, ప్రజా స్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. పోలింగ్‌ను ఎన్నికల కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు మహంతి పెదరామినాయుడు, చిన రామినాయుడు, పిన్నింటి లక్ష్మునాయుడు, మహంతి జోగినాయుడు, కిల్లారి సన్యాసినాయుడు, లంక అసిరినాయుడు, రెడ్డి శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

బాతువ రైతులకు అన్యాయం

జి.సిగడాం: బాతువ గ్రామ రైతులకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బాతువ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కలిశెట్టి శాంతారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్ ఏర్పాటైన 30 ఏళ్లగా బాతువ గ్రామస్తులకే చైర్మన్ పదవి ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వంలోమాత్రం గెద్దకంచరాంకు చైర్మన్ పదవి కేటాయించడం తగదన్నారు. బాతువలో 8 టీసీలు, గెద్దకంచరాంలో 2 టీసీలు ఉన్నాయని, ఎక్కువ టీసీలు ఉన్న గ్రామానికి చైర్మన్ పదవి ఇవ్వడం న్యాయమన్నారు.

సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యత : ఎస్పీ



అధికారులు, సిబ్బందితో చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని, రిటైర్‌మెంట్, డెత్ బెనిఫిట్స్ సకాలంలో అందించి సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలసి మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సర్వీసులో ఉంటూ మృతిచెందిన పోలీసులు, రిటైరైన వారు, హోంగార్డుల కుటుంబ సభ్యుల సమస్యలను అధికారులను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. శాఖాపరమైన అంశాలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, విడో, కార్పస్‌ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్సు స్కీమ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు వంటి రావాల్సిన ప్రయోజనాలతో పాటు పెండింగ్ కారుణ్య నియామకాలు, వ్యక్తిగత సమస్యల గురించి చర్చించారు. వెనువెంటనే కార్యాలయ ఉద్యోగులకు సంబంధిత అంశాలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ ఉన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పెండింగ్ కేసులను తగ్గించేందుకు రాబోయే జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 13న నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగే ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రాజీ పద్ధతి ద్వారానే ఇరు పక్షాలు గెలుస్తాయని, భవిష్యత్‌లో సంబంధాలు కొనసాగుతాయని చెప్పారు. మోటారు వాహన ప్రమాదాల కేసుల్లో బీమా సంస్థలు త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్.ఫణికుమార్, కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వి.వెంకటప్పరావు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా మొదటిరోజైన మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ గడువు పూర్తయి రెండేళ్లు పూర్తయినందున తక్షణమే ఐఆర్ ప్రకటించాలని, విజయవాడలోని గవర్నర్‌పేట 2వ డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని 'లులూ' సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడాన్ని ఆపాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, ఆర్టీసీలో రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలని, సుమారు 8వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, పారదర్శక బదిలీల పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు ఎం.వి.ఆర్.మూర్తి, ఎంఎస్‌రావు, పి.నవీన్‌బాబు, రాజారావు, లక్ష్మణరావు, కళ్యాణి, సునీత, శ్రీదేవి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెనూ బిల్లులు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

రణస్థలం : మధ్యాహ్న భోజన పథకం మెనూ బిల్లులు పెంచాలని, వంట కార్మికులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రణస్థలం హైస్కూల్ వద్ద మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల 7 నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. నెలకు రూ.3వేలు అతి తక్కువ వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోవడం తగదన్నారు. సమావేశంలో భోజన కార్మికుల యూనియన్ రణస్థలం మండల కార్యదర్శి వి.లక్ష్మీ, సభ్యులు డి.లక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

ఎచ్చెర్ల : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మాదక ద్రవ్యాలు, దుష్ప్రభావాలపై మంగళవారం శివానీ డిగ్రీ కాలేజీలో శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్, జోనల్ ఈగల్ బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనలో తల్లిదండ్రుల పాత్ర వివరించారు.

చిత్రలేఖనంతో సృజనాత్మకత



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: చిత్రలేఖనం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయవచ్చని బీహెచ్ఆర్‌సీ(భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్) రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షుడు మణిశర్మ, జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎస్జీవోహంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు దేశభక్తి కలిగేలా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజికవేత్త జైశ్రీరామ్, నగర అధ్యక్షుడు ఆకుల కృష్ణ, యూత్ వింగ్ అధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే వజ్రోత్సవాలు



ఏర్పాట్లలో భాగంగా వేదికకు ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి వజ్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకలకు కోడిరామ్మూర్తి స్టేడియం ముస్తాబవుతోంది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. జిల్లా ఆవిర్భవించి 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న వజ్రోత్సవాలను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రధాన వేదికతోపాటు గ్యాలరీలు, స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీవీపీలు, అధికారులు, స్వాతంత్ర్య సమర యోధులు, మీడియా ఇలా వేర్వేరుగా గేల రీలతో షామియానా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల మైదానం, కోడి రామ్మూర్తి స్టేడియంలలో రన్ ఫర్ శ్రీకాకుళం, క్రీడా–సాంస్కృతిక పోటీలు, పెట్టుబడిదారుల సమావేశం, 'స్వర్ణ శ్రీకాకుళం' ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్, ప్రముఖుల సన్మానాలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించనున్నాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, భద్రతా బాధ్యతలు పోలీస్ శాఖ భుజాన వేసుకుంది.

మురపాక మండల ఏర్పాటుకు తీర్మానాల సేకరణ



తీర్మాన పత్రాలు సేకరిస్తున్న ఎంఎంఎస్ సభ్యులు

రణస్థలం: మురపాక మండల సాధనకు మద్దతుగా వివిధ పంచాయతీల తీర్మానాలను మురపాక మండల సాధన సమితి సభ్యులు సేకరించారు. మండల ఏర్పాటుకు అనుకూలంగా మురపాక, చిన్న మురపాక, కేశవరాయునిపాలెం, లోపెంట, నేతురు లక్ష్మీపురం, గుంటుకుపేట, చిన్నయ్యపేట, బయ్యన్నపేట, చిత్రపేట, బుడుమూరు పంచాయతీల సర్పంచులు తీర్మానాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ సభ్యులు, వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ మురపాక మండల ఏర్పాటుకు జనాభా ప్రాతిపదికన సరిపడకపోతే మురపాకకి దగ్గరగా ఉన్న ఎచ్చెర్ల మండలంలోని గల పలు పంచాయతీల గ్రామ పెద్దలను కలిసి వారి మద్దతు కూడగడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ సభ్యులు గొర్లె శ్రీనుబాబు, వండాన రాంబాబు, పేరూరి గురునాథ్ పాల్గొన్నారు.

తలసేమియా కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం సేవలు విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 83 మంది బాధితులకు ఉచిత రక్తమార్పిడి చేశామని చెప్పారు. సంరక్షకులకు ఉచిత భోజన, వసతి కల్పించామన్నారు. వైద్యులు డాక్టర్ వి.సుచిత్ర, గొవిలి రమణ, సుజాత, ఉమాశంకర్, జగదీష్, ప్రియాంక పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులకు మంగళవారం పాటలపోటీలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ క్రాంతి, అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


భద్రమ్మతల్లికి చల్లదనం



బలగలోని భద్రమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముర్రాట్లు సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

వర్షాలకు కురవాలని కప్పయాత్ర



వర్షాలు కురిసి రైతుల కష్టాలు తీర్చాలని కోరుతూ వాండ్రంగి గ్రామంలో మంగళవారం కప్పయాత్ర నిర్వహించారు. రైతులు, మహిళలు, యువత కలికి కావిడిలో ఊరేగించారు.

–జి.సిగడాం

మొక్కలకు జీవం పోశారు!



సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం నగర పరిధిలో అరసవల్లి మిల్లు కూడలిలో ఏర్పాటు చేసిన మొక్కల స్టాండ్‌లో మొక్కలు ఎండిపోయిన వైనంపై 'మొక్కలకు దిక్కెవరు' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం కొత్త మొక్కలు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం